సాక్షి అనకాపల్లి

సోమవారం ¦ 4 ¦ డిసెంబర్ ¦ 2023



జూ ఆదాయం రూ.6.19 లక్షలు

ఇందిరాగాంధీ జూ పార్కుకు రూ.6.19 లక్షలు ఆదాయం లభించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. 10లో



ఎంఎస్ఎంఈలపై సర్వే!

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈల)పై సమగ్ర సర్వేకు రంగం సిద్ధమవుతోంది. 10లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

సత్యదేవుని దర్శించుకున్న డిప్యూటీ సీఎం బూడి



అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలో సత్యనారాయణ స్వామిని ఆదివారం ఉదయం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. డిప్యూటీ సీఎం పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపికను దేవస్థానం అధికారులు అందజేశారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

అనకాపల్లిటౌన్/తుమ్మపాల: జాతీయ ఉపకార వేతనాల కోసం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ –2023 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఏర్పాటు చేసిన 18 పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ముందుగానే చేరుకున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 4,154 మంది దరఖాస్తు చేయగా 4,008 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. 146 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో 10, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లోని 8 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

మోదకొండమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో కార్తీక ఆదివారం సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పాదాలు వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఉచితంగా ప్రసాదం అందజేశారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు



పంచారామాలకు వెళ్లే భక్తులతో ప్రత్యేక బస్సు

అనకాపల్లిటౌన్: పంచారామాలకు పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆదివారం సాయంత్రం ప్రత్యేక బస్సు బయలుదేరింది. ఈ బస్సు సోమవారం తెల్లవారుజామున అమరావతి చేరుతుంది. అక్కడ భక్తులకు దర్శనం కల్పిస్తారు. తరువాత భీమవరం, పాలకొల్లు, దాక్షారామం, సామర్లకోటల్లో దర్శనం అనంతరం తిరిగి స్థానిక డిపోకు చేరుతుంది. వచ్చే ఆదివారం పంచారామ క్షేత్రాలకు వెళ్లే భక్తులు ముందుగా ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) డీపీటీవోను సంప్రదించాలని సిబ్బంది తెలిపారు.

రాష్ట్ర సర్వేయర్ల సంఘంలో జిల్లా నుంచి ఇద్దరికి స్థానం



స్టేట్ కో–ఆర్డినేటర్లుగా ఎన్నికైన అప్పారావు, నాగేశ్వరరావు

రోలుగుంట: సర్వేయర్ల రాష్ట్ర యూనియన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ కమిటీలో జిల్లా నుంచి రెండు మండలాలకు చెందిన ఇద్దరు సర్వేయర్లకు చోటు లభించింది. విజయవాడ ఎన్జీవో హోంలో ఈ ఎన్నిక నిర్వహించారు. రోలుగుంట మండలం గుండుబాడు సచివాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ శరగడం అప్పారావు, ఎస్.రాయవరం మండలానికి చెందిన సి.హెచ్.నాగేశ్వరరావు కో–ఆర్డినేటర్లుగా ఎన్నికైనట్టు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు మధుబాబు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీలో తమకు చోటు దక్కడంపై అప్పారావు, నాగేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వారు విలేకరులకు తెలిపారు.

అన్నదాతలను వణికిస్తున్న మిచాంగ్

- చివరిలో రైతన్నలకు కష్టాలు
- తుపాను కారణంగా మారిన వాతావరణం
- కోతకు సిద్ధమైన వరి
- రైతులను అప్రమత్తం చేసిన వ్యవసాయాధికారులు



యలమంచిలి సమీపంలో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి చేను

యలమంచిలి(అనకాపల్లి రూరల్): బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. రేయింబవళ్లూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన వరి పంట చేతికందే తరుణంలో తుపాను హెచ్చరికలతో రైతులు కలవరపడుతున్నారు. నీటిఎద్దడిని సైతం ఎదుర్కొంటూ అష్టకష్టాలు పడి రైతులు పంటలను సాగుచేశారు. ఈ ఏడాది పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉంది. మంచి దిగుబడులు వస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్న సమయంలో ఒక్కసరిగా వాతావరణ మార్పులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వరి పంట చేతికొచ్చే సమయంలో తుపాను బలపడి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆదివారం ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఈదురు గాలుల తీవ్రత



కోసిన వరి పనలను ఒబ్బిడి చేస్తున్న రైతు



యలమంచిలిలో కోసిన వరిని దగ్గరుండి కుప్పలుగా వేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది

క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు ప్రారంభించారు.జిల్లాలో ఈ ఏడాది రైతులు 1.11 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరినాట్లు ఆలస్యంగా పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయడం, పెట్టుబడిసాయంతో పాటు సాగుకు అన్నివిధాలా చేయూతనివ్వడంతో అన్నదాతలు ధైర్యంగా సాగు చేపట్టారు. 50 శాతానికి పైగా కోత దశకొచ్చింది. బోర్ల సదుపాయం ఉన్న చోట్ల వరి కోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జిల్లాల్లో పలు ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు ఆదివారం పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. ఐఎండీ హెచ్చరికల ప్రకారం ఈ నెల 5, 6 తేదీల్లో భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఈ దృష్ట్యా రైతులు కోసిన వరి పంటను సురక్షిత ప్రదేశాలు, గోదాముల్లో భద్రపర్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

నేల కొరిగిన పైరు

వరి పైరు ఏపుగా పెరగడంతో ఈదురుగాలులకు కొన్ని చోట్ల పంట నేలకొరిగింది. ఇప్పటివరకూ ఏ నష్టం లేకపోయినా పడిపోయిన పంటపై వర్షం నీరు నిలిస్తే కోసేందుకు కూడా ఉపయోగపడదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. యలమంచిలి సమీపంలో అచ్యుతాపురం రోడ్డు పక్కన ఇప్పటికే కోసిన వరి పనలను దగ్గరుండి స్థానిక ఏఈవో జి.దేముడు, ఎంపీఈవో బి.అరుణ ఆదివారం రైతులతో కుప్పలుగా వేయించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని రైతులను అప్రమత్తం చేశారు. వరికోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు తెలిపారు. ఒకవేళ ఎవరైనా కోతలు కోస్తే వరి పనలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొలాల్లో ఉంచవద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.కోసిన వరిని టార్పాలిన్లతో కప్పి ఉంచుకోవాలని తెలిపారు.

6వ తేదీ వరకు వానలు

తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విశాఖ జిల్లాలో వర్షాలు మొదలు కానున్నాయి. ఐఎండీ నివేదిక ప్రకారం సోమ, మంగళ, బుధవారాల్లో విశాఖతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు వాయిదా వేసుకోవాలి. ఇప్పటికే కోతలు కోసిన వారు పంటను తక్షణమే పొడి ప్రదేశాలు, గోదాములకు చేర్చాలి. పాక్షికంగా ముదిరిన పంటల్లో వర్షపు నీరు పోవడానికి కాలువలను ఏర్పాటు చేయాలి. పైరు గాలికి పడిపోకుండా 4, 5 దుబ్బులను కలిపి కట్టలుగా కట్టుకోవాలి. ఎక్కడైన పంట కోసి ఉన్నట్టయితే కట్టలను కట్టి గూడు కుప్పలుగా వేసుకోవాలి. ఒకవేళ ధాన్యాన్ని నూర్పిడి చేస్తే తప్పనిసరిగా సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవాలి. తగినన్ని టార్పాలిన్లు, పాలిథిన్ పట్టాలు అందుబాటులో ఉంచుకుని, తుపాను వెలిసిన తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టుకునేలా చూసుకోవాలి.

–బి.మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి

తీరంలో అలజడి



రాజయ్యపేట వద్ద కోతకు గురైన తీరం

నక్కపల్లి: మిచాంగ్ తుపాను ప్రభావంతో తీరప్రాంతంలో అలజడి మొదలైంది. సముద్రకెరటాలు ఎగిసిపడుతున్నాయి. తీరంప్రాంతాల వెంబడి ఈదురుగాలులు వీస్తున్నాయి. ఒడ్డున భద్రపరచిన తెప్పలు, ఇంజన్లు, వలల వరకు కెరటాలు దూసుకొస్తున్నాయి. మత్స్యకారులు తెలిపారు. రాజయ్యపేట, బోయపాడు, బంగారయ్యపేట, చినతీనార్ల, పెద తీనార్ల ప్రాంతాలలో ఆదివారం అలల తాకిడికి సముద్ర తీరం కోతకు గురైందని వారు చెప్పారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రెండురోజుల నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లడం లేదు. వేటకు వెళ్లిన వారికి ఫోన్ ద్వారా తుపాను సమాచారం అందజేసి, వెనక్కి రప్పించారు. ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనంటూ వారు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తమైన అధికారులు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పాయకరావుపేట నియోజకవర్గం లోనే ఎక్కువ తీరప్రాంతం ఉంది. మూడు మండలాల్లో సుమారు 17 మత్స్యకార గ్రామాలు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 25 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. దాదాపు 6వేలమంది తెప్పలు, బోట్లపై వేటకు వెళ్తుంటారు. ఈ క్రమంలో తీరప్రాంత గ్రామాల్లో నివసిస్తున్నవారిని ముందుగానే అప్రమత్తం చేసేందుకు అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రావు, తహసీల్దార్ అంబేడ్కర్ ఆదివారం రాజయ్యపేట, బోయపాడు, అమలాపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. రక్షిత భవనాల వద్ద విద్యుత్, జనరేటర్ సదుపాయం, అవసరమైతే నిత్యావసర సరకులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోలు రూం ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.



రేవుపోలవరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఎస్.రాయవరం: మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ సూచించారు. మండలంలో మత్స్యకార గ్రామాలైన బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాల్లో ఆదివారం ఆర్డీవో పర్యటించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. వర్షాలు తీవ్రత పెరిగితే లోతట్టు ప్రాంతాల వారిని ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ ప్రసాద్‌రావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్ మల్లే లోవరాజు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ ఉన్నారు.

ఓట్ల తొలగింపునకు డాక్యుమెంటేషన్ తప్పనిసరి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సాక్షి, అనకాపల్లి: పక్కా డాక్యుమెంటేషన్ ఉంటేనే ఓట్లు తొలగించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపు ప్రక్రియను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో మాడుగుల నియోజకవర్గంలోని కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల మండలాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బీఎల్‌వో రిజిస్టర్‌లను పరిశీలించారు. గ్రామాల్లో 18, 19 సంవత్సరాల యువతీయువకులను గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితాలో తప్పక నమోదు చేయాలన్నారు. వేరొక చోటుకు నివాసం మార్చిన వారిని గురించి క్షుణ్ణంగా విచారించి, చనిపోయిన వారి విషయంలో పక్కాగా పంచనామా నిర్వహించి తొలగింపులు చేయాలని ఆదేశించారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే పైస్థాయి అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. బీఎల్‌వోలు సమర్థంగా పనిచేసే విధంగా ఉన్నతాధికారులు వారికి దిశానిర్దేశం చేయాలన్నారు. పర్యటనలో మాడుగుల నియోజకవర్గ ఈఆర్వో, తహసీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లి మండల కేంద్రంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

తోటకూరపాలెంలో జేసీ పరిశీలన

రావికమతం: కొత్త ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ ఎలా ఉందో పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్ జాహ్నవి తోటకూరపాలెంలో పోలింగ్ బూత్‌లను ఆదివారం సందర్శించారు. ఆ గ్రామంలోని 103, 104 పోలింగ్ బూత్‌లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆ దిశగా సిబ్బందిని అప్రమత్తం చేయాలని తహసీల్దార్ మహేశ్వరరావును ఆదేశించారు.



తోటకూరపాలెంలో వివరాలు తెలుసుకుంటున్న జేసీ జాహ్నవి

మహిళా శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: మహిళా శిశు సంక్షేమశాఖలో జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, బ్లాక్ కోఆర్డినేటర్ ఉద్యోగాలకు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.అనంతలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రెండు ఉద్యోగాలకు ఎంపికైన వారు అనకాపల్లిలోను, బ్లాక్ కోఆర్డినేటర్ పోస్టుకు ఎంపికైన వారు రావికమతంలో పనిచేయవలసి ఉంటుందన్నారు.

- జిల్లా కోఆర్డినేటర్ పోస్టుకు అర్హతలు : 25– 40 ఏళ్ల మధ్య వయసు గల డిగ్రీ (కంప్యూటర్ సైన్స్)లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. అప్లికేషన్ మెయింటెన్స్ అండ్ సపోర్ట్‌లో రెండు సంవత్సరాల అనుభవం, స్థానిక భాషలో చక్కగా మాట్లాడడం, రాయడం వచ్చి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి, ఫీల్డ్ వర్క్ చేయవలసి ఉంటుంది. స్థానికులకు ప్రాధాన్యత ఉంటుంది.
- ప్రాజెక్టు అసిస్టెంట్ : 25 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల వారు అర్హులు. కెపాసిటీ బిల్డింగ్‌లో రెండు సంవత్సరాలు పనిచేసిన అనుభవం, స్థానిక భాషలో మాట్లాడడం, రాయడంతో పాటు ఇంగ్లిషులో కూడా ప్రావీణ్యం కలిగి ఉండాలి.
- బ్లాక్ కోఆర్డినేటర్ : 25 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగి, డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లో రెండు సంత్సరాల అనుభవం, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం. ఈ ఉద్యోగాలు సంవత్సర (12 నెలలు) కాలపరిమితికి మాత్రమే భర్తీ చేస్తామని తెలిపారు. బ్లాక్ కోఆర్డినేటర్ పోస్టును ఓసీ మహిళా అభ్యర్థులకు కేటాయించినట్టు పేర్కొన్నారు. దరఖాస్తుఫారం పూర్తి వివరాలు ఏఎన్ఏకెఏపీపీఏఎల్ఎల్ఐ.ఏపి.ఎన్ఐసి.ఐఎన్ వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయి. అర్హత ధ్రువీకరణపత్రాల నకళ్లపై గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేయించి, పూర్తిచేసిన దరఖాస్తుతో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత కార్యాలయం, ప్లాట్ నంబర్ 3, నూకాలమ్మ గుడి రోడ్డు గవరపాలెం, అనకాపల్లి చిరునామాలో ఈ నెల 14వ తేదీలోపు చేరవేయాలి.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

మునగపాక: రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా జట్టును అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరయ్య, సీహెచ్ దేముడులు ప్రకటించారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్, ఐఎం ఈవెంట్లలో విజయం సాధించిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. కేటగిరీ–1లో పి.నిహాల్, బి.రామతేజ, బి.శ్రీ తేజ, సుమిత, రాణి, కేటగిరి–2లో శ్రీ ధనుష్, జయదీప్, తేజ, నిఖిలేష్, నిఖిల్, సాయి రణధీర్, ధార్మిక, సివంత, కేటగిరి–3లో పద్మాకర్, హర్షిత్, గౌతమ్, నంద, రవీంద్రకుమార్, చేతన్, కార్తీక్, వరసిద్ధి, లహరి, లాస్య తదితరులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వారిని సుందరయ్య, దేముడులు అభినందించారు. నర్సారావుపేటలో ఈ నెల 16, 17 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి.



జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులు

పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం(విశాఖ): మిచాంగ్ తుపాను కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 4వ తేదీన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్ (06073) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 5వ తేదీన భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 6వ తేదీన ఎర్నాకుళం–టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్, 7వ తేదీన ఎస్ఎంవీ బెంగళూరు–గౌహతి (12509) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతానికి కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపు



చోడవరం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించేందుకు చోడవరం నియోజకవర్గంలో నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అందరూ పాటుపడాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. ఈ బస్సు యాత్రలో ప్రజలంతా పెద్దసంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి మద్దతు తెలపాలన్నారు. రోలుగుంట గ్రామంలో బస్సు యాత్ర ప్రారంభమై కొత్తకోట, మేడివాడ, రావికమతం, కోమళ్లపూడి మీదుగా వడ్డాది సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. వడ్డాది కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. వేలాది మంది ఈ సభకు హాజరవుతుండటంతో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ధర్మశ్రీ తెలిపారు. సభను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, అభిమానులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు కృషిచేయాలని ఆయన కోరారు.

పవళింపు సేవ సమయంలో దర్శనాలా?

- చంద్రబాబుకు దర్శనం కల్పించడంపై భక్తుల విస్మయం
- ఆలయ అధికార, వైదికుల తీరుపై విమర్శలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పవళింపు సేవ సమయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు దర్శనం చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ సమయంలో ఆయనకు దేవస్థానం వర్గాలు దర్శనం కల్పించడం పట్ల భక్తులు విస్మయం చెందారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు స్వామికి పవళింపు సేవ నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల దర్శనాలు నిలుపుదల చేస్తారు. కానీ చంద్రబాబు కోసం ఆలయ అధికార, వైదికులు ఆదివారం ఆ సమయం మార్చడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు సింహగిరికి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వచ్చారు. అప్పటికే భక్తుల దర్శనాలు నిలుపుదల చేశారు. సుమారు ముప్పావుగంట సమయం చంద్రబాబు ఆలయంలో ఉన్నారు. ఆయన బయటకు వచ్చిన తర్వాత స్వామికి పవళింపుసేవ చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామి పవళింపు సమయం మార్చడంపై ఆలయ అధికార, వైదికులు ఏం సమాధానం చెబుతారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు మధ్యాహ్నం 12.25కి సింహగిరికి చేరుకోవాలి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు స్వామిని దర్శించుకోవాలి. కానీ ఆయన సరిగ్గా పవళింపు సేవ సమయానికి వచ్చారు. దేవస్థానం వర్గాలు ముందస్తు చర్యలు తీసుకోకుండా పవళింపు సమయంలోనే ఆయనకు స్వామి దర్శనం కల్పించారు. ఈ విషయంపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని వివరణ కోరగా వైదికుల సూచనలతో ఆ సమయంలో చంద్రబాబును దర్శనానికి అనుమతించామన్నారు. ఆయన వెళ్లిన తర్వాత పవళింపు సేవ చేసినట్లు వివరించారు. ఇక టీడీపీ శ్రేణులు అడుగడుగునా అత్యుత్సాహం ప్రదర్శించారు. ఘాట్‌రోడ్డులో పార్టీ జెండాలతో యథేచ్ఛగా తిరిగారు. రాజగోపురం ఎదురుగా ఉన్న పాత ఎంక్వైరీ కార్యాలయం ప్రాంగణం వరకు జెండాలు పట్టుకొని హడావుడి చేశారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చిన చంద్రబాబుకు విమానాశ్రయంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి.



సింహగిరిపై రాజగోపురం ఎదురుగా టీడీపీ జెండాలతో పార్టీ శ్రేణులు.. అభివాదం చేస్తున్న చంద్రబాబు

బోల్తా పడిన సూపర్‌స్టార్స్

కీలక మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: కచ్చితంగా విజయం సాధించాల్సిన మ్యాచ్‌లో సదరన్ సూపర్ స్టార్స్ బోల్తా పడింది. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ– వీడీసీఏ స్టేడియంలో లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ–20లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టీ–20 లీగ్‌లో ఇరు జట్లకు ఇదే చివరి మ్యాచ్. నాకవుట్ లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగాయి. జెయింట్స్ కెప్టెన్ కెవిన్ టాస్ గెలిచి లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో సూపర్ స్టార్స్ రాస్ టేలర్ సేన తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తరంగ, జెస్సీ ఓపెనర్స్‌గా రాగా.. శ్రీశాంత్ ఇన్నింగ్స్ తొలి బంతిని విసిరాడు. జట్టు స్కోర్ 18 పరుగుల వద్ద ఈశ్వర్ చౌదరి ఓవర్‌లో జెస్సీ వికెట్ల వెనుక రావల్‌కు దొరికిపోయి తొలి వికెట్‌గా వెనుతిరిగాడు. రెండో వికెట్‌కు తరంగ– శ్రీవత్స్ 55 పరుగులు జోడించడంతో పాటు బౌండరీల మోత మోగించారు. చివరికి సదరన్ సూపర్ స్టార్స్ జట్టు ఎనిమిది వికెట్లకు 159 పరుగులతో ఇన్నింగ్స్ ముగించింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన జెయింట్స్ ఓపెనర్ ధ్రువ్ రావల్ డకౌట్‌గా తొలి వికెట్ కోల్పోయింది. ఇన్నింగ్స్ చక్కదిద్దే క్రమంలో మరో ఓపెనర్ కెవిన్(29) వెనుదిరగ్గా అతని స్థానంలో వచ్చిన రిజర్డ్ కేవలం ఒక పరుగే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ స్థితిలో వచ్చిన అభిషేక్(81) 10 ఫోర్లు, మూడు సిక్సర్లతో అభిమానులను అలరించాడు. అతనికి చిరాగ్(21)తోడయ్యాడు. చివర్లో చిగుంబురా(21) 10 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు బాది మరో ఎనిమిది బంతులుండగానే జట్టును విజయతీరానికి చేర్చాడు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో అభిమానులు హాజరై మ్యాచ్‌ను వీక్షించారు.



రజాక్ బౌలింగ్‌లో అవుటైన ధ్రువ్. క్యాచ్ పట్టిన దిండాను అభినందిస్తున్న శ్రీవత్స్

నేడు మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ ఢీ

లీగ్‌లో చివరి మ్యాచ్ సోమవారం మణిపాల్ టైగర్స్, అర్బన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. ఈ రెండు జట్లు మూడేసి మ్యాచ్‌ల్లో విజయంతో, ఓ పరాజయంతో ఆరేసి పాయింట్లు సాధించాయి. జెయింట్స్ ఏడు పాయింట్లతో ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్‌కు వర్షం పడే సూచనలున్నాయి. ఒకవేళ వర్షం పడకుండా పూర్తి మ్యాచ్ జరిగితే జెయింట్స్ ఆధిక్యాన్ని కోల్పోనుంది. కాగా.. ఒకే ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించిన క్యాపిటల్స్, సూపర్‌స్టార్స్, కింగ్స్ జట్లు మూడేసి పాయింట్లతో లీగ్‌ను ముగించాయి. కాస్త మెరుగైన రన్‌రేట్‌తో క్యాపిటల్స్ జట్టు నాకవుట్‌కు చేరుకుంది. లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ–20 నాకవుట్ మ్యాచ్‌లు సూరత్‌లో జరగనున్నాయి.

క్లుప్తంగా

కథా-2022 పుస్తకావిష్కరణ



కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవి సిదారెడ్డి, శివారెడ్డి తదితరులు

సీతంపేట: కవులు, కథకులు, రచయితలకు సామాజిక బాధ్యత ఉందని ప్రముఖ కవి కె.శివారెడ్డి అన్నారు. కథా సాహితీ పేరిట మిత్ర సాహితీ, విశాఖపట్నం ప్రచురించిన కథా సంకలం కథా-2022 పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్రముఖ రచయిత గంట్యాడ గౌరునాయుడు అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి నందిని సిదారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు మ్యానిఫెస్టో ప్రభావంతో తనలో మార్పు వచ్చిందని, ప్రతి ఒక్కరూ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో చదవాలన్నారు. మిత్ర సాహితీ సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ ఏటా రకరకాల పత్రికల్లో వచ్చిన కథలు చదివి.. అందులో ఎంపిక చేసిన 10 నుంచి 15 కథలతో పుస్తకాన్ని ప్రచురించడం 1990 నుంచి పాపినేని శివశంకర్‌తో కలిసి చేస్తున్నట్టు తెలిపారు. ఒకప్పుడు కథల్లో ఉన్న నాణ్యత ఈరోజు ఉందా అంటే లేకపోవచ్చు గానీ.. చాలా మంది యువకులు కథలు రాయడం నేటి ప్రత్యేకతగా పేర్కొన్నారు. కథా రచనలో అద్భుతంగా చేయి తిరిగిన పతంజలి శాస్త్రి, మధురాంతకం నరేంద్ర లాంటి గొప్ప రచయితలతోపాటు వేణుగోపాల్, చరణ్ పరిమి వంటి కొత్త రచయితల కథలు ఇందులో ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటి వరకు 200 మంది రచయితలు రాసిన 450 వరకు కథలు వివిధ సంకలనాల్లో ప్రచురించినట్టు తెలిపారు. కవి సిదారెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ వచ్చాక కథల్లో సీరియస్‌నెస్ తగ్గిందని.. రచయితలు ఉన్నత ప్రమాణాలతో కథలు రాయాలని సూచించారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి, తానా ప్రచురణల కమిటీ చైర్‌పర్సన్ కన్నెగంటి చంద్ర, రచయితలు, అనువాదకులు ఎల్.ఆర్.స్వామి, కల్లూరి శ్యామల, కె.ఎస్.మల్లీశ్వరి, చింతకింది శ్రీనివాసరావు, వేణు మాస్టర్, విమర్శకులు విశాఖ వర్మ, సీపీఐ నాయకులు జె.వి.సత్యనారాయణమూర్తి, పలువురు సాహితీవేత్తలు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

సేవా భావంలో మేటి వలంటీర్లు

సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి పింఛన్ల అందజేత

వలంటీర్లు వృత్తి ధర్మంలో సేవా భావాన్ని చూపిస్తూ పింఛనుదారులకు అండగా నిలుస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని నెరవేరుస్తూ సంక్షేమ పథకాలను చేరవేస్తున్నారు. తాజాగా కోటవురట్ల, మునగపాక, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో అందుబాటులో లేని పింఛనుదారుల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని సొంత ఖర్చులతో విశాఖలోని వివిధ ఆస్పత్రులకు వెళ్లి వారికి పింఛన్లు అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.



మునగపాక: పెందుర్తిలో రామకృష్ణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్



మునగపాక: కూర్మన్నపాలెంలో విమలావతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్



మునగపాక: విశాఖ కేజీహెచ్‌లో లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జగది



కోటవురట్ల: విశాఖలోని గీతం ఆస్పత్రిలో బాబూరావుకు నగదు అందిస్తున్న వలంటీర్లు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటకు చెందిన సారిశ రామకృష్ణ అనారోగ్యంతో పెందుర్తిలో తన కుమార్తె వద్ద ఉంటున్నాడు. ఆదివారం వలంటీర్ నరేంద్రబాబు అక్కడకు వెళ్లి ఈ నెల పింఛన్ రూ.2750 అందజేశాడు. మెలిపాకకు చెందిన నిదాని విమలావతి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కూర్మన్నపాలెంలో బంధువుల ఇంటి వద్ద ఉంటోంది. అక్కడకు వలంటీర్ గుబ్బల నూకరత్నం వెళ్లి పింఛన్ అందజేసింది. విశాఖ కేజీహెచ్‌లో పదిహేను రోజులుగా చికిత్స పొందుతున్న గణపర్తి గ్రామానికి చెందిన దాడి లక్ష్మికి అదే గ్రామానికి చెందిన వలంటీర్ వెలగా జగది పింఛన్‌ను అందజేసి అందరి మన్ననలు అందుకుంది.

కోటవురట్ల: మండలంలోని కె.వెంకటాపురానికి చెందిన గొల్లు బాబూరావు అనారోగ్యంతో విశాఖలోని గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్లు ఉండా రమణమ్మ, గొల్లు రామలక్ష్మి అక్కడకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు.

చీడికాడ: మండలంలోని చెట్టుపల్లికి చెందిన డప్పు కళాకారుడు ములుపర్తి అప్పారావు అనారోగ్యంతో విశాఖలోని విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వలంటీరు పాతాళం ప్రసాద్ తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ అందించాడు. అప్పారావు భార్య చాలా ఆనందం వ్యక్తం చేసింది.



కె.కోటపాడు: కేజీహెచ్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీర్ దేముళ్లు



చీడికాడ: విమ్స్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీర్ ప్రసాద్

కె.కోటపాడు: మండలంలోని కింతాడ గ్రామానికి చెందిన పల్లా దుర్గాలమ్మ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. వలంటీర్ జోగ దేముళ్లు తన సొంత ప్రయాణ ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ అందించాడు.

కొప్పుల వెలమలను 'బీసీఏ'లో చేర్చాలి



కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబును సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

చోడవరం: వెనుకబడిన కొప్పుల వెలమ కులాన్ని బీసీ ఏ రిజర్వేషన్ కేటగిరీలో చేర్చాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. చోడవరం నియోజకవర్గం వెలమ సంక్షేమ సంఘం వన సమారాధన కార్యక్రమం అడ్డూరులో ఆదివారం జరిగింది. ఈ వన సమారాధనకు నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో కొప్పుల వెలమ కులస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ కొన్ని కులాలను బీసీడీలో చేర్చడం వల్ల ఈ కేటగిరిలో ఉన్న కొప్పుల వెలమలకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనివల్ల అన్ని రంగాల్లో ఇంకా వెనుకబడి ఉన్న కొప్పుల వెలమ కులాన్ని బీసీ ఏ కేటగిరిలో రిజర్వేషన్ కల్పించే విధంగా సమావేశం చేసిన తీర్మానం మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని నాయుడుబాబు చెప్పారు. సామాజికంగా పెద్దసంఖ్యలో ఓటర్లు ఉన్నప్పటికీ రాజకీయ పరంగా ఇంకా తగినంత గుర్తింపు లేదని, ఉత్తరాంధ్రలో కొప్పుల వెలమలకు ఒక రాజ్యసభ, ఎమ్మెల్సీ వంటి నామినేటెడ్ పోస్టులు కూడా ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని నాయుడుబాబు అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కొప్పుల వెలమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమే ఈ కులాన్ని గుర్తించి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. నవరత్నాల వైస్ చైర్మన్ నారాయణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నరవత్నాల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, అనేక పథకాలు అమలు చేసిందని, ఈ పథకాల్లో కొప్పుల వెలమ కులస్తులకు కూడా ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ శ్రీనువాసులునాయుడు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, బీజేపీ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ ఈర్లె శ్రీరామ్మూర్తి, రైల్వే బోర్డు మెంబరు బొడ్డు శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ పోతల లక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్య రూపంలో విష్ణు సహస్ర నామాలు

రచయిత గాయత్రీదేవికి ఘన సన్మానం



గాయత్రీదేవిని సన్మానిస్తున్న వేదపండితులు, సాహితీప్రియులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల వ్యాఖ్యాత , తిరుప్పావై ప్రవచనకర్త, విశ్రాంత తెలుగు పండిట్ డాక్టర్ వేదాల గాయత్రీదేవిని ఆదివారం నక్కపల్లిలో ఘనంగా సన్మానించారు. గాయత్రీదేవి విష్ణు సహస్ర నామాలను పద్యరూపంలో రాశారు. అలాగే వేంకటేశ్వర సుప్రభాతాన్ని న్యస్తాక్షర పద్యమంజరిలో రచించారు. ఈ రెండింటిని పుస్తక రూపంలో ముద్రించారు. ప్రతి ఒక్కరికీ సులభమైన రీతిలో అర్థమయ్యేలా పద్య రూపంలో విష్ణు సహస్రనామాలను రాసిన ఆమెను బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వేదపండితులు, సాహితీ ప్రియులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేదపండితులు అనంత పద్మనాభశర్మ, మైలవరభట్ల సత్యనారాయణమూర్తి, శ్రీపాద సత్యదేవశర్మ మాట్లాడుతూ శాంతి పర్వంలో భీష్ముడు ఉపదేశించిన విష్ణు సహస్ర నామాలకు ఎంతో విశిష్టత ఉందన్నారు. శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని శ్రీ శంకరభగవత్పాదులు అద్వైత పరంగా వ్యాఖ్యానించారన్నారు. కవయిత్రి గాయత్రీదేవికి చందశ్శాస్త్రంలో అపారమైన అనుభవం ఉండడం వల్లే విష్ణు సహస్రనామాలను పద్య రూపంలో రాయగలిగారని కొనియాడారు. సన్మాన గ్రహీత డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ విష్ణు సహస్ర నామాలను పద్య రూపంలో రాయడం ఎంతో కష్టం, సాహసోపేతమైనదన్నారు. అలా రాయగలిన శక్తి సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వరుని దయ వల్లే లభించిందన్నారు. పుస్తకాల ముద్రణకు బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, సాహితీప్రియులు, సహచర విశ్రాంత ఉద్యోగులు సహాయ సహకారాలు అందించారన్నారు. సన్మాన కార్యక్రమంలో ఉపమాక దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, డి.వి.రామారావు, ఇంద్రకంటి బాబి, శ్రీపాదప్రణవ్, ఎస్.వి.ఎల్ కుమారి, శ్రీపాద సత్యభాస్కర ప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల కోలాహలం



రావికమతం: జోనలో సందర్శకులు

నాతవరం: మండలంలో సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాటలాడారు. దూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వీరంతా రావడంతో ఇక్కడ కోలాహలం నెలకొంది. కార్తీక మాసం కావడంతో మహిళలు స్నానమాచరించి సమీపంలో శివ పార్వతులను దర్శంచుకున్నారు. కొంతమంది వన సమారాధన ఏర్పాటు చేసుకుని సాయంత్రం వరకు ఆటపా టలతో ఆనందంగా గడిపారు. అదే విధంగా తాండవ రిజర్వాయరు వద్ద సందర్శకుల తాకిడి కనిపించింది.

రావికమతం: మండలంలో పిక్నిక్ స్పాట్‌గా పేరొందిన బొమ్మాలమ్మజోనలో ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. పలు గ్రామాల నుంచి పెద్దలు, యువకులు వాహనాలపై పెద్ద ఎత్తున చేరుకుని ఆహ్లాదకరంగా గడిపారు. ఉదయమే ఇక్కడికి వచ్చి సెలయేరు, జలపాతం వద్ద స్నానాలాచరించి ఆపై బొమ్మాలమ్మతల్లిని దర్శించుకున్నారు. అక్కడే వంటలు చేసుకుని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలను ఊగుతూ ఆనందాన్ని ఆస్వాదించారు. టి.అర్జాపురం శాస్త్రిగారి మామిడి తోటలో కొత్తకోట వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ సభ్యులు ఆటల పోటీలు, మిమిక్రీ, మ్యాజిక్‌షో వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసుకుని సందడిగా గడిపారు.

జూ ఆదాయం రూ.6.19 లక్షలు



నీటి ఏనుగు కొలను వద్ద సందర్శకులు

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. కార్తీక మాసం మూడో ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు జూ పార్కును సదర్శించారు. పిల్లలు, పెద్దలు రోజంతా వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు వద్ద సరదాగా గడిపారు. ఈమూలు, నెమళ్లు, ఆఫ్రికన్ చిలుకలు తదితర పలు రకాల పక్షులు, ఏనుగులు, కోతులు, చింపాంజీలు, పులులు, సింహాలు, అడవికుక్కలు, హైనాలు, మొసళ్లు, పాములు సందర్శకులను అలరించాయి. జూలో ఇటీవల ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద పిల్లలు సందడి చేశారు. ఏడు వేల మందికిపైగా సందర్శకులు జూను సందర్శించగా రూ.6.19 లక్షలు ఆదాయం లభించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

'కాపులంతా సమన్వయంతో మెలగాలి'



కాపు వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ఆరిలోవ(విశాఖ): ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ పార్కులో విశాఖ కాపు యూత్ కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా కాపు సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కాపు సామాజిక వర్గం ప్రముఖులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు, డాక్టర్ పీవీ సుధాకర్, సింహాచలం దేవస్థానం ట్రస్టు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు మాట్లాడారు. తూర్పు కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ అందరూ ఒక్కటేనని తెలిపారు. ఎలాంటి బేధం లేకుండా కాపులంతా ఒకటిగా కలసి మెలసి మెలగాలన్నారు. జీవీఎంసీ యూనియన్ నాయకుడు మహదేవ ఆనంద్, తోటరాజు, మూర్తి, గుంటూరు న ర్సింహమూర్తి, విశాఖ కాపు యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం .సురేష్, కార్యదర్శి వై .సురేష్, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలపై సర్వే!

- దీనిపై త్వరలో వార్డు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ
- ఏ పరిశ్రమకు ఏమి అవసరమో సర్వే ద్వారా గణన
- విశాఖ జిల్లాలో 14,433 ఎంఎస్‌ఎంఈలు
- వీటి ద్వారా 1.55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు

సాక్షి, విశాఖపట్నం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈల)పై సమగ్ర సర్వేకు రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయడం కోసం ఈ సర్వేను చేపడుతోంది. వార్డు, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఈ సర్వే నిర్వహించనున్నారు. ఇటీవల వీరికి సర్వేపై ఆన్‌లైన్‌లో ప్రాథమికంగా అవగాహన కల్పించారు. త్వరలో వీరికి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం సర్వేను మొదలు పెడతారు. సర్వేలో వివిధ రంగాల వారీగా ఎన్ని ఎంఎస్‌ఎంఈ యూనిట్లున్నాయి? వాటి ఉత్పత్తి పరిమాణం ఎంత? భవిష్యత్తు అవసరాలేమిటి? మానవ వనరుల లభ్యత, నైపుణ్య సిబ్బంది ఎంత మంది ఉన్నారు? ఏ తరహా నిపుణులు ఎంతమంది అవసరం? వంటి వాటిపై సమగ్రంగా సర్వే చేస్తారు. ఈ అంశాలు ఎంఎస్‌ఎంఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. సర్వేను అనుసరించి అవసరమైన నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో శిక్షణనిచ్చి ఎంఎస్‌ఎంఈల్లో నియామకాలు చేపడతారు. మరికొద్ది రోజుల్లోనే ఈ సర్వే ప్రక్రియను ప్రారంభిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి 'సాక్షి'కి చెప్పారు.

విశాఖ జిల్లాలో 14,433 ఎంఎస్‌ఎంఈలు

విశాఖ జిల్లాలో ఉత్పత్తి ప్రారంభించిన ఎంఎస్‌ఎంఈలు 14,433 ఉన్నాయి. వీటిలో స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేషన్, బేకరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రీసైక్లింగ్ యూనిట్లు, మెడికల్, మాడ్యులర్ ఫర్నిచర్, కోల్డ్ స్టోరేజీలు, లేబరేటరీలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, రెడీమేడ్ గార్మెంట్స్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ రిపేర్లు, గూడ్స్/పాసింజర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసులు, కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, ఆయిల్ మిల్లులు, పీవీసీ పైపులు, వాటర్ ప్లాంట్లు, టెంట్ హౌస్‌లు వంటివి ఉన్నాయి. వీటి ద్వారా రూ.8,240.73 కోట్ల పెట్టుబడి సమకూరింది. వీటిలో 1,55,732 మంది ఉపాధి పొందుతున్నారు. ఇంకా ప్రారంభం కావలసిన ఎంఎస్‌ఎంఈలు 34 ఉన్నాయి. వీటితో మరో 670 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

చికిత్సతో డిమెన్షియాను నయం చేసుకోవచ్చు

తాటిచెట్లపాలెం: డిమెన్షియా రావడానికి ప్రధాన కారణం అల్జీమర్స్ అని ఆంధ్రమెడికల్ కాలేజీ న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం దొండపర్తి స్టేషన్ రోడ్‌లో గల బెస్ట్ వెస్ట్రన్ ప్లస్ తేజ్ వివాన్ హోటల్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, డిమెన్షియా ఇండియా అలయన్స్, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమెన్షియాను ముందుగానే గుర్తించినట్లయితే సమర్థవంతమైన చికిత్సతో నయం చేసుకోవచ్చన్నారు. గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజి సైక్రియాట్రిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్ రాజు, డిమెన్షియా ఇండియా అలయన్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్ రాజులు మాట్లాడుతూ డిమెన్షియా మెదడులోని నరాల కణాలను దెబ్బ తీస్తుందని, ఇది మెదడులోని అనేక ప్రాంతాల్లో సంభవించవచ్చన్నారు. వయసు, మానసిక క్షీణత వల్ల డిమెన్షియాకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎల్పీజీ డివిజనల్ సేల్స్ హెడ్ వై.రవి కుమార్, ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ ఎన్.గోపాలకృష్ణ, స్నేహసంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి జగన్ కృషి

పీఎంపాలెం(విశాఖ): అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే అన్నారు. ఆదివారం శిల్పారామంలో జిల్లా కళింగ ఆర్యవైశ్యుల వనసమారాధనలో ఆయన ప్రసంగించారు. తమ సమస్యలను తెలియజేస్తే ప్రభుత్వ దృష్టికి తీసకు వెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సుమారు 2 వేలకు మందికిపైగా కళింగ ఆర్యవైశ్య కుటుంబాలు రోజంతా ఉత్సాహంగా గడిపారు.

సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో.. నగర ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వల్లూరి నూకరాజు ఏడాదికొకసారి ఇలా కుటుంబాలతో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యదర్శి పూసర్ల సురేష్ కుమార్, ట్రెజరర్ గ్రంధి దుర్గా ప్రసాద్, పిక్నిక్ నిర్వాహక చైర్మన్ పి. వంశీధర తదితరులు పాల్గొన్నారు.

నవోదయం.. విద్యార్థులకు శుభోదయం

- విద్యార్థుల భవితకు బంగారు బాటలు
- 6, 9వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఏర్పాట్లు
- బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి స్పెషల్ డ్రైవ్
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన అడ్మిషన్లు



కొమ్మాదిలోని నవోదయ విద్యాలయం

విశాఖ విద్య: జిల్లాలోని కొమ్మాదిలో గల నవోదయ విద్యాలయంలో విద్యార్థుల భవిష్యత్‌కు పటిష్టమైన పునాదులు వేసేలా ఉన్నత ప్రమాణాలతో చదువులు సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అండగా నిలుస్తోండటంతో ఇక్కడి విద్యార్థులు చదువులతో పాటు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌తో బోధన సాగుతుండటంతో కొమ్మాది నవోదయ విద్యాలయంలో చేరేందుకు విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరో తరగతిలో సీటు లభిస్తే, 12వ తరగతి (ఇంటర్మీడియెట్) వరకు ఇక్కడ ఉచితంగానే చదువుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నవోదయ విద్యాలయ అధికారులు సిద్ధమయ్యారు. 6, 9వ తరగతులతో పాటు, ఇంటర్ మొదటి సంవత్సరంలో అర్హులైన ప్రతిభ గల విద్యార్థులకు అడ్మిషన్ కల్పించే నిమిత్తం ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 12 సీట్లు, 9వ తరగతిలో 11 సీట్లు ప్రస్తుతం ఖాళీ ఉండటంతో వీటి భర్తీ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు


ఎన్‌ఈపీ అమలుతో క్రేజ్

కొమ్మాదిలోని నవోదయ విద్యాలయంలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు సైతం వర్తింపజేస్తున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన జరుగుతోంది. 2023-24 విద్యా సంవత్సరంలో 442 మంది చదువుతున్నారు. వీరిలో బాలురు 235 మంది, బాలికలు 207 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన విద్యాలయంలో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సీబీఎస్‌సీ సిలబస్‌తో బోధన సాగే నవోదయ విద్యాలయానికి క్రేజ్ బాగా పెరిగింది.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పెద్దపీట

6వ తరగతిలో ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున మొత్తం 80 మందికి ప్రవేశం కల్పించనున్నారు. అదే విధంగా 12వ తరగతి (ఇంటర్మీడియట్)లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ గ్రూపుల్లో మొత్తం 45 మందికి అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా ఇక్కడ ఎక్కువగా చదువుకుంటున్నారు. 6వ తరగతిలో ప్రవేశం కోసం 2024 జనవరి 10న, ఇంటర్మీడియట్‌కు ఫిబ్రవరి 10న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకే సీటు సొంతమౌతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంతం వారికి 25 సీట్లు కేటాయించనున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



పేద వర్గాలకు చెందిన పిల్లలే ఇక్కడ చదువుతున్నారు. వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా చదువులు చెబుతున్నాం. కార్పొరేట్ మాదిరి బట్టీ చదువులు కాకుండా, ఒత్తిడి లేని చదువులు అందిస్తాం. ఆటపాటలతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థులకు దేశంలో ఎక్కడ పోటీలు జరిగినా మా నవోదయ విద్యాలయ పిల్లలు భాగస్వామ్యయ్యేలా శ్రద్ధ తీసుకుంటాం.

– కె.సంజయ్, ప్రిన్సిపాల్, కొమ్మాది నవోదయ విద్యాలయం

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందు కు కావాలంటే.. కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జీవీఎంసీ 82వ వార్డు సచివాలయం-14 ఆర్టీసీ కాంప్లెక్స్ రామాలయం సమీపంలోను, మండలంలోని పాపయ్యపాలెం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెద్దిశెట్టి గోవింద్‌లు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, కార్పొరేటర్ మందపాటి సునీత, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కశింకోట: మండలంలోని జమాదులపాలెం సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్‌లు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించి, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాల్సిందిగా కోరారు.

గౌరీపరమేశ్వరులకు నక్షత్ర హారతి



భక్తి సంకీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం

అనకాపల్లిటౌన్: సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం శివకూటమి భక్త బృందం వారిచే స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో ఆదివారం నక్షత్ర హారతి నేత్రపర్వంగా సాగింది. అంతకు ముందు భక్తిసంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడేళ్ల తర్వాత వేంకటేశుని ఊంజల్ సేవ



వేంకటేశ్వరస్వామి ఊంజల్ సేవలో పాల్గొన్న ఎంపీ సత్యవతి దంపతులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేమునిగుమ్మం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కరోనా కారణంగా గత మూడేళ్లుగా నిలిచిన స్వామివారి ఊంజల్ సేవ పునఃప్రారంభించినట్లు ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి, గోవిందరావు దంపతులు తెలిపారు. శనివారం రాత్రి నిర్వహించిన ఊంజల్ సేవలో ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సభ్యులచే అన్నమాచార్య సంకీర్తనలు, జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్నసన్యాసిరావు, రాజాన లక్ష్మి, శ్రీధరాల కోమలి, ఉమ్మడి పైడిరాజు, బెల్లాన అనురాధ, ఈవో రాజసులోచన, ఆలయ అర్చకులు పులకండం గిరిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
కాలింగ్ సహస్ర	: సత్యనారాయణస్క్రీన్-1
బ్రీత్(వైద్యో నారాయణో హరి)మార్నింగ్ షో	
విక్రమ్ రాథోడ్	: సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 16 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 268 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 209 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.





నా పేరు వడ్లమూరి సత్యనారాయణ. మాది కశింకోటలోని సత్యనగర్. పాడి పశువుల పెంపకమే ప్రధాన జీవనాధారం. వయసు మీద పడుతుండటంతో కొన్నాళ్లుగా కాళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నా. దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లా. వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేశారు. రక్తం తీసి పరీక్షించారు. మందులు కూడా ఇచ్చారు. పైసా కూడా ఖర్చవలేదు. గతంలో ఇప్పట్లా వైద్య సదుపాయాల్లేవు. చిన్నచిన్న రోగాలకూ అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఒక్కోసారి డాక్టర్లుండేవారు కాదు. జగన్‌బాబు ప్రభుత్వం వచ్చాక పీహెచ్‌సీల్లో వైద్య సేవలు చాలా మెరుగుపడ్డాయి. రోజూ డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. అవసరమైన వైద్య సేవలందిస్తున్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపర్చారు. ఆస్పత్రి ప్రహరీ ఎత్తు చేశారు. పీహెచ్‌సీ భవనానికి మరమ్మతులు చేసి, రంగులతో అందంగా తీర్చిదిద్దారు. మాలాంటి పేదలకు ఉచిత సేవలందించడానికి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు, మౌలిక వసతులు మెరుగుపర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.



నాడు-నేడులో అందంగా ముస్తాబైన తాళ్లపాలెం పీహెచ్‌సీ

• నరికొత్తగా మండలంలోని పీహెచ్‌సీలు. • నాడు-నేడులో రూ.కోటితో రెండింటా అభివృద్ధి

పీహెచ్‌సీలతో ఆరోగ్య ధీమా

ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల ద్వారా అందుతున్న వైద్య సేవల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పీహెచ్‌సీల్లో సదుపాయాలు బాగా మెరుగుపడ్డాయి. నాడు-నేడు కింద నిధులు వెచ్చించి మౌలికవసతులు కల్పించారు. దీంతో ఏ అనారోగ్యం వచ్చినా.. పీహెచ్‌సీలో వైద్యం దొరుకుతుందన్న భరోసా పెరిగింది.

నాడు పీహెచ్‌సీలు చాలా వరకు అలంకారప్రాయంగానే ఉండేవి. డాక్టర్లుంటే.. మందులుండేవి కావు. మందులుంటే.. డాక్టర్లుండేవారు కారు. రోగమేదైనా పారాసిటమాల్, ఓ సిరప్ అంతే. అదృష్టముంటే బతికి బట్టకట్టేవారు. లేకుంటే.. అంతే..!

నేడు పీహెచ్‌సీలు కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో అభివృద్ధి చెందాయి. నాడు-నేడు పథకంలో ఒక్కోఆస్పత్రికి రూ.అరకోటికిపైగానే వెచ్చించారు. పూర్తి స్థాయిలో సిబ్బంది. అందుబాటులో అన్ని రకాల మందులు, రోగనిర్ధారణ పరీక్షలు. ప్రతి పల్లెకూ ఆరోగ్య ధీమా..!

కశింకోట: మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో ఒకటి కశింకోట, మరొకటి తాళ్లపాలెంలో ఉన్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడు కింద దాదాపు రూ.కోటితో వీటిని అభివృద్ధి చేశారు. ఇంకా కొన్ని అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్

పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం పల్లె జనాల నమ్మకాన్ని చూరగొంది. ఐశ్వర్యవంతుల మాదిరే తమ కుటుంబానికీ ఓ సొంత డాక్టరున్నారన్న ధీమానిచ్చింది. నెలలో రెండుసార్లు ప్రతి గ్రామానికీ వెళ్తున్నారు. గర్భిణులు, మంచానపడ్డ రోగులకు వారింటి వద్దే వైద్య సేవలందుతున్నాయి.



తాళ్లపాలెంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ల్యాబ్ భవనం



నాడు-నేడులో అభివృద్ధి చేసిన కశింకోట పీహెచ్‌సీ

8 వేల మందికి ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష కింద సచివాలయాల వారీగా గత నెలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. పది రకాల పరీక్షలతోపాటు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సేవలందించారు. కంటి పరీక్షలు, ఈసీజీ, డెంగ్యూ, మలేరియా, టీబీ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపి, అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో 8 వేల మందికి పైబడి వైద్య సేవలు పొందారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని మరింత మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్, పట్టణంలోని ప్రధాన ఆస్పత్రికి సిఫార్సు చేశారు.

కశింకోట పీహెచ్‌సీ

నాడు-నేడు కింద రూ.65 లక్షలతో అభివృద్ధి చేశారు. ప్రహరీ నిర్మించారు. పీహెచ్‌సీ భవనానికి మరమ్మతులు చేసి అందంగా రంగులతో ముస్తాబు చేశబూరు. రోగులకు మరుగుదొడ్లు, కేంద్రం లోపల సౌకర్యవంతంగా సిమెంట్ రోడ్లు నిర్మించారు.

తాళ్లపాలెం పీహెచ్‌సీ

పీహెచ్‌సీ ప్రాంగణంలో కొత్తగా రూ.50 లక్షలు వెచ్చించి ల్యాబ్ భవనం నిర్మిస్తున్నారు. ఏడాది క్రితం 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీగా దీన్ని అభివృద్ధి చేశారు. పీహెచ్‌సీకి రోజూ వందల సంఖ్యలో రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.



కశింకోట పీహెచ్‌సీలో రోగికి అందుతున్న వైద్య సేవలు

వైద్యసేవలు భేష్



కొద్ది రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాను. పీహెచ్‌సీలో డాక్టర్‌ను కలిశాను. పలు పరీక్షలు చేశారు. ఇన్‌ఫెక్షన్ నివారణకు అవసరమైన మందులు అందించారు. వాటిని డాక్టర్లు చెప్పిన విధంగా వేసుకుంటున్నారు. రోగం చాలా వరకు తగ్గుముఖంపట్టింది. గతంతో పోల్చుకుంటే జగన్‌బాబు ప్రభుత్వంలో వైద్య సేవలు చాలా బాగా అందిస్తున్నారు.

– గుమ్మాల అప్పలనరసమ్మ, కశింకోట

ఘనంగా అంబలం పూజ



కశింకోట గవరపేటలో అంబలం పూజలో పాల్గొన్న భక్తులు

కశింకోట: స్థానిక గవరపేట రామాలయం వద్ద శనివారం రాత్రి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడు, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామిల విగ్రహాలు, పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీదేవి చిత్ర పటాలను అందంగా అరటి దొప్పలు, పూలతో అలంకరించారు. అర్ధరాత్రి వరకు అయ్యప్ప పాటలతో భజన చేశారు. గురు స్వాములు బీశెట్టి ఆనంద్, వేగి రామకోటేశ్వరరావు, కాండ్రేగుల నూకఅప్పారావు దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండలంలోని చింతలపాలెంలో భక్తులు అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఆదివారం ఊరేగించారు. చింతలపాలెం నుంచి నరసింగబిల్లి, జెట్టపురెడ్డి గ్రామాల మీదుగా ఊరేగింపు సాగింది. అయ్యప్ప స్వామిని కీర్తిస్తూ, భజన చేస్తూ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టి రాము, గురుస్వామి జెర్రిపోతుల నూకినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన లాఫింగ్ క్లబ్ వినోదం

అనకాపల్లిటౌన్: స్థానిక వైఎంవీఏ హాలులో లాఫింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పలు వినోద కార్యక్రమాలు నవ్వులు పండించాయి. క్లబ్ అధ్యక్షుడు దాడి వాసు, కార్యదర్శి బొడ్డేడ మురళీ అధ్యక్షతన జరిగిన ఓ మనిషి నిన్ను నువ్వు చూసుకో, పిల్లలు కాదు బాబోయ్ పిడుగులు కామెడీషోకు జి.వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించగా ఆకుల మౌళివర్ధన్, ఆకుల రోషన్‌బాబులు తమ నటనతో హాస్యాన్ని పండించారు. నవ్వులే నవ్వులు కార్యక్రమంలో మిమిక్రీ కళాకారుడు శ్రీకృష్ణ తన ప్రతిభతో కడుపుబ్బా నవ్వించారు. పులఖండం విజయబాబు ఈల పాట, జోకులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

తుపాను గాలులకు నేలకొరిగిన వరిచేలు



కశింకోట వద్ద తుపాను గాలులకు పొలంలో నేలకొరిగిన వరిచేను



వరి పనలను కుప్పలుగా కూడదీసుకున్న రైతులు

కశింకోట: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల మండలంలో పలుచోట్ల వరి చేలు నేలకొరిగాయి. రెండు రోజులుగా మండలంలోని పలు ప్రాంతాల్లో గాలులు భారీగా వీస్తున్నాయి. కోతలు జరగని వరి చేలపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. కశింకోట, వెదురుపర్తి, అడ్డాం, చెరకాం, గొబ్బూరు, నూతలగుంటపాలెం తదితర ప్రాంతాల్లోని వరి చేలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వర్షాలు పడట్లేదు. వర్షం పడితే అవి తడిచిపోయి, దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు జరిగిన చోట మడుల్లోనే వరి పనలను ఆదరా బాదరాగా కూడదీసుకుని కుప్పలు పెట్టారు. పంట చేతికి అంది వచ్చే తరుణంలో మిచాంగ్ వల్ల ఏం జరుగుతుందోనని రైతుల మదన పడుతున్నారు.

సెమీ క్రిస్మస్ సన్నాహాలు



ఆంధ్ర కల్వరి బాప్టిస్టు చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ చెట్టు

కశింకోట: కశింకోటలోని సెంచునరీ ఆంధ్ర కల్వరి బాప్టిస్టు చర్చిలో సెమీ క్రిస్మస్‌కు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా చర్చి ఆవరణలో క్రిస్మస్ చెట్టును విద్యుద్దీపాలంకరణతో ఏర్పాటు చేశారు. ఈ అలంకరణ క్రైస్తవ సోదరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



కూచిపూడి నృత్య పోటీల చిన్నారులతో దాడి రత్నాకర్



గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న రత్నాకర్ దంపతులు



వ్యాస రచన విజేతలకు బహుమతుల అందజేత

అనకాపల్లిటౌన్: పిల్లల్లో నాట్య పటిమను వెలికితీసేందుకు నృత్యపోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం కామాక్షిదేవి అమ్మవారి దేవాలయం ఆవరణలో అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో విశాఖ ఉమ్మడి జిల్లాల కూచిపూడి నృత్యపోటీలను ఆదివారం ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. సేవాసంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజిబాబు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, సంస్థ సభ్యులు గోవిందరాజు, పెదబాబు, గంగారాం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

➡ స్థానిక డీవీఆర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో దివ్యాంగులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

➡ స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల కోటి కుంకుమార్చన పూజలో పాల్గొన్న రత్నాకర్ దంపతులు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు కొణతాల కారుబాబు, దాడి ఈశ్వరరావు, విల్లూరి ప్రసాద్, మళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. దివ్యాంగులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లగిశెట్టి గణేష్, భజన మండలి ప్రతినిధి ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవాలు



విజయోత్సవ కార్యక్రమంలో బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్: బీజేపీని దేశ ప్రజలు ఆదరించడం సంతోషంగా ఉందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి వెంకటరమణ అన్నారు. బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడం పట్ల స్థానిక నెహ్రూచౌక్‌లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పథకాలు, ఆయన పాలనా పటిమే ఏ ఎన్నికల్లోనైనా పార్టీని విజయం దిశగా నడిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.రమేష్, కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా ఇన్‌చార్జి భక్తసాయిరాం, నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్, మారిశెట్టి భాస్కరరావు, కపిల్ తాతారావు, కరక సత్యనారాయణ, పార్టీ నేతలు భర్నికాన నరసింహమూర్తి, పి.అచ్యుతరామారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు సంబరాలు



నెహ్రూచౌక్‌లో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

అనకాపల్లిటౌన్: తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు దేశ రాజకీయాల్లో కీలక మలుపని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్ అన్నారు. స్థానిక గాంధీనగర్ నుంచి నెహ్రూచౌక్ వరకూ ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో కాంగ్రెస్ నేతలు సమష్టిగా కృషి చేయడం అభినందనీయమన్నారు. రాహుల్‌గాంధీ జోడో పాదయాత్ర యువతలో చాలా మార్పు తీసుకు వచ్చిందన్నారు. రాహుల్ నాయకత్వం దేశానికి అవసరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఐఆర్ గంగాధర్, కూండ్రపు అప్పారావు, తనకాల అనంతరావు, దాసరి సంతోష్, తుట్టా రమణ, మల్లపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తియాదవ్, సేనాపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం విజయోత్సవాలు జరిపారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సందర్భంగా మిఠాయిలు పంచారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కత్తెర శ్రీధర్, నియోజక వర్గ కో-ఆర్డినేషన్ సభ్యుడు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సూరా శ్రీనివాస్, పార్లమెంట్ సమన్వయకర్త బోయిన భానుమూర్తి పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన



వన సమారాధనలో సిద్ధి వినాయక బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

కశింకోట: స్థానిక ప్రమీలా తోటలో సిద్ధి వినాయక బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన ఆదివారం నిర్వహించారు. సుమారు 60 కుటుంబాలు పాల్గొని ఆధ్యాత్మికత, ఆట పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం వేదుల వెంకటశాస్త్రి, డాక్టర్ కాశీభట్ల రమణమూర్తి, వార్డు సభ్యుడు కందాల సురేష్, సంఘం అధ్యక్షురాలు అవసరాల సీతా కామేశ్వరి, కార్యదర్శి మొక్కరాల కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ వద్ద పిక్నిక్ సందడి

అనకాపల్లిటౌన్: మండలంలోని బొజ్జన్నకొండ వద్ద ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా కార్తీక వనసమారాధనకు చాలా మంది తెల్లవారుజాము నుంచే కొండ వద్దకు చేరుకున్నారు. బొజ్జన్న, లింగాల కొండలను సందర్శించి, అక్కడే ఉన్న బృందావన గార్డెన్లో సేదతీరారు. పిక్నిక్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా కేంద్ర పర్యాటకశాఖ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు.

త్రిమూర్తుల ఆలయంలో త్రినాథ వ్రతం



త్రినాథ వ్రతంలో అర్చకులు

కశింకోట: స్థానిక శివాలయం వద్దనున్న త్రిమూర్తుల ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని త్రినాథవ్రతాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల విగ్రహాలను అలంకరించి, వేద మంత్రోశ్చరణలతో సంప్రదాయంగా పూజలు జరిపారు. అనంతరం త్రినాథ వ్రత కథ చదివారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.